# పగిలిన అద్దం

(ఊహా చిత్రం)

వయసు మళ్ళినా పెళ్ళి కాని చెల్లెలి మొహం. నా అద్దంలో ముక్కలైనట్టుంది. నాన్న తెచ్చిన సంబంధాలు వద్దన్నది. ఎందుకంటే కూతురు పెళ్ళి కూడా తన వ్యాపారాలలో ఒకటను కుంటున్నాడట. ఇతరులకు ఏది సుఖమో అతనే నిర్ణయిం చడం మంచిది కాదట. నాన్న చేసిన తప్పేమిటో నా కర్థం కాదు. చెల్లెలు మొండితనం చూస్తే తన కసహ్యం వేస్తుంది ఇంతకీ ఏం బావుకుంది? పెళ్ళికాకుండా వుండిపోయింది. అంతా స్వయంకృతం. కాని దానికేం విచార మున్నట్టు లేదు. హుషారుగానే వుంది.

ఇంతకూ నాన్న ఆస్తి నా వొక్కడికే వస్తుందనే ఈర్ష్య కొద్ది పెళ్ళి మానుకుం దేమో ననిపిస్తూంది. ఇప్పుడు నాన్న ఆస్తిలో సగం వాటా తను కొట్టేస్తుంది. నాకు సగం పంగనామం చుట్టేస్తుంది. అందుకే నా అద్దంలో అది వికృతంగా కనిపిస్తుంది.

నాన్న వ్యాపారంలో తను డబ్బు మదుపు పెట్టి నష్టపోయా నంటాడు మామయ్య. మామయ్య వాటా ఎప్పుడో తిరిగిచ్చేశా నంటాడు నాన్న. తనకు అన్యాయం జరిగిం దంటాడు మామయ్య. అమ్మ మామయ్యను వెనకేసు కొస్తుంది, పాపం పిల్లల వాడట ; లేనివా డెవడో !

మామయ్య ఈతకాయ యిచ్చి తాటికాయ లాగాలని చూస్తున్నాడు, నాన్నని ఒగా చేసి నాకేం మిగలకుండా ఆస్తి లాగేయాలని వాడి కుతంత్రం. అందుకే నా అద్దంలో మామయ్య వికృతంగా కనిపిస్తాడు.

నాన్న దొంగ వ్యాపారంచేసి పన్నులు ఎగవేశాడని ఇనస్పెక్టరు వారంటు పట్టు కొచ్చాడు, గోవిందః భజగోవింద గోవిందః

కావాలంటే ఓ పది వేలు లంచం పారేస్తా నన్నాడు నాన్న. ఆ పది వేలు నాకు మిగల కుండా పోతాయి, నష్టమే మరి. అయినా ఫరవాలేదు. తక్కినదేనా మిగులుతుంది. కాని లంచం ఇస్తానన్నందుకు కొట్లో తోసేస్తాను జాగర్త న్నాడు ఇన్‌స్పెక్టరు. పది వేలు ఇస్తానంటే వద్దంటున్న వాడిని చూస్తే నా కొళ్ళు మండింది. పైగా జైలుకు పంపుతాడట. ఇంత కృతజ్ఞత లేనివాళ్ళని చూస్తే నా కసహ్యం. నా అద్దంలో వాడి మొహం రెండేసి ముక్కులతో నాలుగేసి కళ్ళతో ఆరేసి చెవులతో వికారంగా కనిపించింది.

ఇంతకీ నా పని గోవిందః నాన్న సంపా దించినదంతా సర్కారువాళ్లు లాగేసుకుంటే ఇక నాకేం మిగులుతుంది? లోకమంతా నా మీద పగపట్టి నాకు ఆస్తి దక్కకుండా చేయాలని చూస్తున్నట్టుంది. నా వెనకనున్న లోకం నా అద్దంలో వికృతాకారంలో కని పిస్తూంది.

ఇన్‌స్పెక్టరు, నాన్న వ్యాపారం తాలూకు రికార్డు పుస్తకాలన్ని తీసి చూపించమన్నాడు. అటకమీద కర్ర పెట్టె కిందికి దింపించాడు. తుప్పుపట్టిన తాళం అతి కష్టంమీద తీసి మూత తెరిచారు.

పెట్టెనిండా పురుగులు, చెదలు, బొద్దెం కలు, కాగితాలు తిని బాగా బలిసి సంతానం వృద్ధి చేసుకున్నాయి. పుస్తకాలన్నిటినీ పిప్పి చేశాయి. ఒక్క కాగితమేనా మిగలలేదు. పెట్టంతా కాగితపు పొడి. ఇన్‌స్పెక్టరు మొహం వేలేశాడు. మంచి పనయింది. కావాలంటే బొద్దెంకల్నీ, చెదపురుగుల్నీ జైల్లో పెట్టుకోమను.

బొద్దెంకలన్నీ చాలా దర్జాగా, హుందాగా గదంతా పరుగెత్తాయి. నా అద్దంలో అవి ఎంతో అందంగా కనిపించాయి. (బొ.సూ.)